# గూనిదానికి తగిన శాస్తి

పితృవాక్యపరిపాలకుడైన రాముడు అడవికి బయలుదేరాడు. భర్తతో పాటు సీత కూడా బయలుదేరింది. వాళ్లని అనుసరించాడు లక్ష్మణుడు. పుత్ర వాత్సల్యం పుష్కలంగా ఉన్నా, కట్టుకున్న భార్య మాటను కాదనలేకపోయిన ముసలి రాజు దశరథుడు కన్ను మూశాడు.

అంతఃపుర మంతా అల్లకల్లోలంగా ఉంది. ఎవరి ముఖం చూసినా, శోకం తాండవిస్తోంది. ఎవరి నోట విన్నా ఒకే మాట: 'ఎంతలో ఎంత ఘోరం జరిగింది!'

అయోధ్యా పౌరులు తల్లిని కోల్పోయిన పిల్లల్లా కనిపించారు.

రామపట్టాభిషేకం మహా వైభవంగా జరుగుతుందనీ, ఆ వైభవాన్ని కళ్లారా చూసి ఆనందించాలనీ కలలు కన్న పిన్నలూ పెద్దలూ నిరాశకు లోనయ్యారు. పైపెచ్చు రాముడు వనవాసాని కని అడవులకు బయలుదేర డం వాళ్లని శోకంలో ముంచింది. హంస తూలికా తల్పం మీద శయనించే ఆ రాజవంశీయులు కటికి నేల మీద ఎలా శయనిస్తారో! అనుకుని మరీ దుఃఖించారు.

పట్టాభిషేకం చేసుకుని రాజ్యం చెయ్యవలసిన రాముడు ఎంత కష్టపడతాడో పాపం - అనుకున్నారు కొందరు. అంత మంచివాడికా యింత కష్టం వచ్చిపడింది!

పాలబుగ్గల బంగారు బొమ్మ సీతమ్మ అడవుల్లో ఎన్నెన్ని యాతనలు అనుభవిస్తుందో, ఏమిటో తలచుకుంటేనే కడుపు చెరువవుతోంది. అంతా దుర్విధి. లేకపోతే ఒక మహారాజు కూతురు, మరో మహారాజు కోడలు, ఒక వీరుడి యిల్లాలు...పాపం, అడవుల్లో గుడ్లగూబల చూపుల మధ్య, నక్కకూతల నడుమ ఎలా నివసిస్తుందో -ఇలా అనుకున్నారు కొందరు, సీత దురవస్థను తలచుకుని భరించరాని విచారంతో.

కొందరికి లక్ష్మణుడంటే అంతులేని ఆదరం చెప్పనలవి కాని జాలి కలిగాయి. అతను ఏరికోరి కష్టాలు తెచ్చిపెట్టుకున్నాడనుకున్నారు. ఎంత త్యాగం, ఎంత త్యాగం! అని పరిపరి విధాల రామానుజుణ్ణి ప్రశంసించారు.

ముసలి రాజుకి భార్య అంటే ఎంతప్రేమో అంత భయం. అవే యీ అనర్థానికి అసలు కారణం అని ఖచ్చితంగా చెప్పారు కొందరు. కొందరైతే దశరథుడి గుణగణాలు గుర్తు చేసుకుని 'అలాంటి మహారాజు మనకు దొరకడం చాలా కష్టం' అన్నారు.

ఆ మహారాజు భార్య కైకను అందరూ తూర్పార పట్టినవారే. కడుపున పుట్టిన కొడుక్కి రాజ్యం కట్టబెట్టాలని మొదటి నుంచీ కలలు కంది. పుత్రప్రేమ అవసరమే... అందుకు రాముడిని బాధ పెట్టాలా! తన వల్ల తనను ప్రాణప్రాణంగా అభిమానించిన భర్త కన్ను ముయ్యాలా! తన మాంగల్యం మంట కలవాలా! తన కన్ను తానే పొడుచుకున్నట్టయింది! కైక ఎంతగానో పరితపించింది. ఏం లాభం? జరగకూడనిది జరిగింది. ఆమె దుఃఖ భారాన్ని గ్రహించిన వారెవ్వరూ లేరు.

రాజు మరణించాడు. పెద్ద కొడుకు రాముడేమో అడవులకు దారి తీశాడు... మరి రాజ్య పాలన కొనసాగాలి. జరగవలసిన పనులు జరగాలి. భరతుడి కోసం మనుషుల్ని పంపించారు. అప్పుడతను మేనమామల యింట్లో ఉన్నాడు.

ఈ వాతావరణంలో కైకేయి నివసించే ఆ సుందర మందిరంలో, సురభిళ ద్రవ్యాలు గుభాళించే ఒక గదిలో ఒకామె తనను అలంకరించు కుంటోంది. మధ్య మధ్య వెకిలి నవ్వులు ఒలకబోస్తోంది; అద్దంలో చూసుకుని తన అందచందాలను చూసి మురిసి పోతోంది. ఆమె పేరు కుంజి.

కుంజి అమూల్యమైన పట్టుపుట్టం కట్టింది. ముప్పయిరకాల ఆభరణాలు ధరించింది. కమ్మని వాసనలు విరజిమ్మే మైపూతలు అలుము కుంది. నిలువుటద్దం ముందు నిలబడి గంటల తరబడి సింగారించు కుంది. తనలో తాను నవ్వుకుంది. తన అందం మాటిమాటికి చూసుకుని మరి మరీ మురిసిపోయింది.

'ఇప్పుడు నన్ను చూసిన వాళ్లెవరైనా గుర్తు పడతారా? కైకమ్మ నేస్తం కుంజి అంటారా నన్ను?' అనుకుంది. అంతగా సింగారించుకుంది.

'భరతులవారు వస్తున్నారు... వస్తున్నారు... పక్కకు తొలగండి...' అనే కేకలు వినవచ్చాయి.

అంతవరకూ అజగరంలా ఉన్న ఆ భవనానికి చలనం వచ్చింది.

భరతులవారు... వినగానే కుంజికి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. ఒక్కసారి అద్దంలో తన ముఖం చూసుకుంది. ఆ ఆభరణాలు ఆ మైపూతలు అవన్నీ తనను అవహేళన చేస్తున్నట్టు ఎందుకో అనిపించింది. అయినా ఆ అవహేళన ఆమె మనస్సులోని కోరిక ధాటికి నిలవ లేకపోయింది.

అల్లంత దూరాన భరతుడు కనిపించాడు.

కుంజి ఊహలకు రెక్కలు వచ్చాయి. 'నేను కురూపినే... గూనిదాన్నే... ముసలిదాన్నే... అయితే యేం? నా అందచందాలు చూసి తప్పకుండా భరతుడు నా కోరికను మన్నిస్తాడు... అయన్ని నేను ప్రేమించాను... ఆయనకంటే నేను పెద్దదాన్నే... అయితే యేం? ప్రేమకు వయస్సు పానకంలో పుడక కాదు. ఒకవేళ నా ప్రేమను భరతుడు తిరస్కరించినా, నేను మాత్రం అతని వలపునేస్తాన్నే... ఇవాళ నా చిరకాల వాంఛ నెరవేరు తుంది... భరతుడు రాజవుతాడు. నా ప్రేమ ఫలిస్తుంది... నా భరతుడు తప్పకుండా నన్ను ఆదరిస్తాడు....'

'ఛీ గూనిదానా! నీ వేషం నువ్వూను. నీ పాడు బుద్ధులు పోనిచ్చావు కావు...'

పిడుగుల్లాంటి ఆ మాటలకు కుంజి హడలి పోయింది. ఆమె కట్టు కున్న ఒంటి స్తంభం మేడ కుప్పలా కూలిపోయింది. ఊహల లోకంలోంచి వాస్తవ ప్రపంచంలోకి వచ్చింది. స్తంభం చాటున నిలబడి గాలిమేడలు కట్టుకుని సంబరపడి పోతున్న కుంజి త్వరత్వరగా పక్కకి తొలగబోతుంటే, కొప్పు పట్టి ఆమెను చరచర ఈడ్చుకు పోయాడు శత్రుఘ్నుడు. కుయ్యో మొర్రో అని శోకాలు పెట్టింది. ఇంకెప్పుడు దరిదాపులకి రానని రకరకాల

ఒట్లు పెట్టుకుంది... అయినా ఆమెకు దేహశుద్ధి తప్పలేదు. ఆమెకు శత్రుఘ్నుడు రాక్షసుడిలా కనిపించాడు.

'గూనిదానికి తగిన శాస్తి జరిగింది... కైకమ్మకి ఎంత నేస్తమయితే మాత్రం ఇలా పిచ్చిపిచ్చి వేషాలు వేస్తుందా? దీని మతి మండిపోను!...' అనుకున్నారు ఆ దృశ్యం చూచిన వాళ్లు. నవ్వుకున్నారు. ఆ గంభీర వాతావరణంలో ఆ నవ్వులు దూదిపింజ లయినాయి.

మూర్తీభవించిన శోకం... దీనవదనుడు... భరతుడు.... మెలమెల్లగా మేడమెట్లెక్కి పైకి వస్తున్నాడు.

(14వ శతాబ్దికి చెందిన మాధవ కందలి అనే కవి అస్సామీ భాషలో ప్రముఖ కవిగా పేరుపెంపులు గడించాడు. ఆయన రామాయణం రచించాడు. వాల్మీకం మాతృక అయినా, ఆ మహాకవి చెప్పని కథలెన్నో ఆయన తెలియజేశాడు. వాటిలో కురూపి అయిన కుంజి కథ ఒకటి. హాస్యరసాన్ని మనస్సులో ఉంచుకుని మాధవకందలి ఆ కథను చొప్పించి వుండవచ్చునని విమర్శకులు భావిస్తున్నారు. అంతకు మించి మరో విశేషం లేదు ఈ కథకు.)